సాక్షి
కుమురం భీం

శుక్రవారం । 11 । జూలై । 2025



గురుపౌర్ణమి వేడుకలు

జిల్లాలోని వివిధ ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు పాదాభివందనం చేసి ఆశీర్వచనం తీసుకున్నారు. 9లో▸



మండుతున్న ధరలు! 9లో▸

జిల్లాలో కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. నెల రోజుల క్రితం నిలకడగా ఉన్న ధరలు ప్రస్తుతం రెట్టింపయ్యాయి. పేదలు ఇబ్బందులు పడుతున్నారు.

గరిష్టం/కనిష్టం
32.3 /26.3

వాతావరణం


ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతు పవనాల ప్రభావంతో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.



ఇద్దరే ముద్దు..!

- ఉమ్మడి కుటుంబాలతోనే మేలు
- చిన్నకుటుంబాలపైనే యువత ఆసక్తి
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

1.దేశంలో మరో 25ఏళ్లలో యువజనుల సంఖ్య తగ్గి వృద్ధుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఒక్కొక్కరు ముగ్గురు పిల్లల కన్న ఎక్కువ మందిని కనాలన్న సూచనలపై మీరేమంటారు..



2. పెళ్లి తర్వాత పిల్లలపై మీ ప్రణాళిక ఏమిటి



3. మీది ఉమ్మడి కుటుంబమా..? చిన్న కుటుంబమా..?



4. ఉమ్మడి కుటుంబాల వల్ల ప్రయోజనమా.. చిన్న కుటుంబాల వల్లనా..?



మంచిర్యాలటౌన్/ఆదిలాబాద్/బెల్లంపల్లి/చెన్నూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జనాభా రోజు రోజుకు పెరిగిపోతూనే ఉంది. యువజన భారతంగా వెలుగొందుతున్న దేశంలో మరో 25ఏళ్లలో యువజనుల సంఖ్య తగ్గి వృద్ధుల సంఖ్య పెరిగే అవకాశం ఉందనే అంచనా ఉంది. గతంలో ఇద్దరు పిల్లలే ముద్దు అనే నినాదం ఉండగా.. ప్రస్తుతం ఒక్కొక్కరూ ముగ్గురు కంటే ఎక్కువ మందిని కనాలనే సూచన వస్తోంది. నేడు ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' యువతీ, యువకులు, పెళ్లయిన జంటలు 300 మందిని పలు అంశాలపై గురువారం సర్వే నిర్వహించింది. వీరిలో అధిక శాతం ఉమ్మడి కుటుంబాలతోనే మేలు జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇద్దరు పిల్లలే చాలని.. భవిష్యత్ ప్రణాళికలోనూ ఇద్దరే ముద్దు అని పేర్కొన్నారు. ఉద్యోగం, ఉపాధి తదితర కారణాలతో చిన్న కుటుంబాలుగా వేరుపడడానికే మొగ్గు చూపారు.

న్యూస్‌రీల్

13న మహంకాళి అమ్మవారికి బోనాలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో ఉన్న మహంకాళి అమ్మవారికి ఈనెల 13న బోనాలు సమర్పించనున్నట్లు మహంకాళి బోనాల కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్ తెలిపారు. పట్టణంలోని లారీ చౌరస్తా నుంచి మహంకాళి దేవాలయం వరకు బోనాలతో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటాపాట ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్: భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుండి ఫోన్‌లో మాట్లాడారు. ప్రాణ, ఆస్తి నష్టాలు కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలతో వాగులు, వంకలు ఉప్పొంగి, ప్రాణహిత ఉధృతంగా ప్రవహిస్తోందన్నారు. కుమురంభీం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేశామన్నారు. పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టామని కలెక్టర్ మంత్రికి వివరించారు.

ఏఐ ద్వారా అభ్యాసన సామర్థ్యాల పెంపు

వాంకిడి: ఆర్టిఫిషియల్ ఇంటలిజన్స్(ఏఐ) ద్వారా విద్యాబోధనతో వెనుకబడిన విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలను పెంచవచ్చని అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. గురువారం బెండార ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. కంప్యూటర్ సహాయంతో ఆర్టిఫిషియల్ ఇంటలిజన్స్ బోధన పద్ధతిపై ప్రదర్శన ద్వారా వివరించారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, ఎంఈవో శివ చరణ్ ఉన్నారు.

పట్టణంత జనం..!

ఈ ఏడాది థీమ్..
"యువతకు న్యాయమైన, ఆశాజనక ప్రపంచంలో వారు కోరుకునే కుటుంబాలను సృష్టించడానికి వారిని శక్తివంతం చేయడం"

- ఏటేటా పెరుగుతున్న జనాభా
- అమ్మాయిల జననాలే అధికం
- క్రమంగా తగ్గుతున్న మహిళల సంఖ్య
- ఉమ్మడి జిల్లాల్లో జనాభా తీరిదీ
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం



లింగ నిష్పత్తి				ఆరేళ్లలోపు చిన్నారుల లింగ నిష్పత్తి		
జిల్లా	గ్రామీణం	పట్టణం	మొత్తం	గ్రామీణం	పట్టణం	మొత్తం
ఆదిలాబాద్	993	978	989	933	927	931
కుమురంభీం	995	1012	998	942	956	944
మంచిర్యాల	988	963	977	919	900	911
నిర్మల్	1060	997	1046	949	949	949

లింగ నిష్పత్తి ప్రతీ వెయ్యి మందికి

2011 ప్రకారం ఉమ్మడి జిల్లా జనాభా

జిల్లా	పురుషులు	స్త్రీలు	మొత్తం	జనసాంద్రత(చ.కి.మీ.)
ఆదిలాబాద్	3,56,407	352565	708972	179
కుమురం భీం	258197	257615	515812	115
మంచిర్యాల	408272	398765	807037	207
నిర్మల్	346721	362697	709418	190



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కన్ను తెరిస్తే జననం.. కన్ను మూస్తే మరణం. రెప్పపాటులో పుట్టుక చావులు జరిగిపోతున్నాయి. ఏటేటా జనాభా పెరిగిపోతోంది. గతంతో పోలిస్తే జనన, మరణాల సంఖ్య పెరుగుదల రేటు తగ్గిపోతోంది. మారుతున్న పరిస్థితులు జనాభాను నియంత్రిస్తున్నాయి. అందరికీ అన్ని సౌకర్యాల కల్పన మానవ సమాజంలో క్లిష్టంగా మారింది.. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. ఉమ్మడి జిల్లాలో జనాభాతోపాటు పట్టణాల్లో నివసించే వారి సంఖ్య పెరుగుతోంది. గిరిజన, మైదాన ప్రాంతాల్లో మార్పులు వస్తున్నాయి.

తగ్గుతున్న మహిళా జనాభా

ప్రతీ వెయ్యి మంది పురుషులకు మహిళల సంఖ్య తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల పలు సర్వేల్లోనూ లింగనిష్పత్తి తగ్గుతూ వస్తోంది. పురుషులకు సమానంగా స్త్రీలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2011అధికారిక జనాభా లెక్కల్లోనే ఇది స్పష్టమైంది. స్త్రీ, పురుష సమానత్వం లేకపోతే సమాజంలో అసమానతలు ఏర్పడే అవకాశం ఉంది. మరోవైపు లింగనిర్ధారణ చేస్తు ఆడశిశువులను పురిటిలోనే చంపేయడం జనాభాలో అసమతుల్యతకు కారణంగా మారుతున్నాయి.


అమ్మాయిలే పుడుతున్నారు..

'సీఆర్ఎస్(రిజిస్ట్రార్ జనరల్, గణాంక కమిషనర్ సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం) 2021 నివేదికలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 26576మంది అబ్బాయిలు పుట్టగా, అమ్మాయిలు మాత్రం 25124మంది జన్మించారు. అదే సమయంలో మహిళల కంటే మగవారి మరణాలే ఎక్కువగా నమోదయ్యాయి. ఈ వివరాల ప్రకారం 10,455మంది పురుషులు చనిపోతే, స్త్రీలు 7,832మంది మరణించారు.

పెరుగుతున్న వలసలు..

గ్రామాలు వదిలి విద్యా, ఉద్యోగ, ఉపాధి సౌకర్యాల కోసం అధికంగా వలసలు పెరుగుతున్నాయి. దీంతో క్రమంగా పట్టణీకరణ పెరుగుతోంది. 2011లెక్కల ప్రకారం మంచిర్యాల జిల్లా 43.8శాతం, ఆదిలాబాద్ 23.7శాతం, నిర్మల్ 21.4, కుమురంభీం జిల్లాలో 16.9శాతంతో పట్టణ జనాభా ఉంది. ప్రస్తుతం 2025నాటికి సంఖ్య మరింత పెరగనుంది. అయితే పట్టణాల్లో పెరుగుతున్న వలసలకు అనుగుణంగా శుభ్రమైన తాగు, ఉండేందుకు ఇల్లు, విద్యా, వైద్యం, ఉద్యోగ, ఉపాధి వసతలు కల్పన జరగాల్సి ఉంది. లేకపోతే అల్పాదాయంతో పేదరికంలో అధిక జనాభా మగ్గాల్సి వచ్చే ప్రమాదం ఉంది. జిల్లాలో ప్రతీ చదరపు కిలోమీటరకు జనసాంద్రత చూస్తే ఆసిఫాబాద్ జిల్లా తక్కువ ఉండగా, పట్టణీకరణ చెందిన మంచిర్యాల జిల్లాలో అధికంగా ఉంది. ప్రస్తుతం 2025 నాటికి జనసాంద్రత మరింత పెరగనుంది. వసతులు, సౌకర్యాలు అధికంగా ఉన్న ప్రాంతాలకు వలసలతో ఆ ప్రాంతాల్లో జన సాంద్రత పెరుగుతోంది.

ఆరేళ్లలోపు చిన్నారుల జనాభా



భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పక్కన ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్: భారీ వర్షాల దృష్ట్యా జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. గురువారం ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్లు దీపక్‌తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్, ఆర్డీవో లోకేశ్వర్ రావు, పోలీసు శాఖ అధికారులతో కలిసి కలెక్టరేట్ నుంచి మండల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపెల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు ఉప్పొంగితే ప్రభావిత గ్రామాల వారికి ముందస్తు హెచ్చరికలు జారీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. నాలుగు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, వాహనదారులు వాగులు దాటకుండా బందోబస్తు చేపట్టాలన్నారు. శిథిలావస్థ ఇళ్లల్లో ఉండే వారిని సురక్షితప్రాంతాలకు తరలించాలని, అధికారులు జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉండాలని సూచించారు. ఎస్పీ కాంతిలాల్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో విపత్తు రక్షణ బృందాలను ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించామన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన పారదర్శకంగా జరగాలి..

జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీ కోసం వచ్చిన దరఖాస్తులు, ధ్రువపత్రాల పరిశీలన పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. గురువారం అంకుసాపూర్ శివారులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో అవుట్ సోర్సింగ్ పోస్టుల కోసం వచ్చిన దరఖాస్తులను అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి పరిశీలించారు. అర్హత కలిగిన వారిని ఎంపిక చేయాలన్నారు. ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర నివేదికలు లేకుండా ఎలా వస్తారు?



సమావేశంలో పాల్గొన్న ఎంపీ నగేష్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అధికారులు

- ఎంపీ గోడం నగేష్
- కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిపై సమీక్ష
- పలు శాఖల అధికారులపై అసంతృప్తి

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లా అధికారులు సమగ్ర నివేదికలు లేకుండానే 'దిశ' సమావేశానికి ఎలా హాజరవుతారని ఎంపీ గోడం నగేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన దిశ (జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ) సమావేశానికి ఎంపీ హాజరై కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, మైనింగ్, విద్య, వైద్య, వ్యవసాయ, బీఎస్ఎన్ఎల్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో ప్రస్తుతం అమలులో ఉన్న పథకాల పురోగతిపై ఆయా శాఖల వారీగా సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు. జిల్లాలో మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 973 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 137 అంగన్‌వాడీ టీచర్లు, 357 ఆయా పోస్టులు ఖాళీలుగా ఉన్నాయన్నారు. బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లల చదువు, ఆరోగ్యంపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తిర్యాణి మండలం గోవేన గ్రామ పంచాయతీలో విద్యుత్తు సరఫరా లేని ఆవాస ప్రాంతాలకు వెంటనే విద్యుత్తు సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అధికారులపై అసంతృప్తి...

దిశ సమావేశంలో పలు శాఖల అధికారులపై ఎంపీ నగేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలో గతేడాది, ప్రస్తుత ఏడాదిల్లో ఎలాంటి పనులు చేపట్టారని, ఎంత మందికి పని దినాలు కల్పించారని, ఎన్ని నిధులు వ్యయం చేశారని ప్రశ్నించగా.. ఆ శాఖ పీడీ నుంచి సరైన సమాధానాలు రాకపోవడంతో ఎంపీ అసహనం వ్యక్తం చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద ఎన్ని సీసీరోడ్లు, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాలు నిర్మిస్తున్నారు? సీసీరోడ్లకు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఎంపీలు, ఇన్‌చార్జి మంత్రి నుంచి ఎన్ని ప్రతిపాదనలు వచ్చాయని ప్రశ్నించారు. సీసీ రోడ్ల మంజూరులో జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, ఏదైనా అడిగితే జిల్లా ఇన్‌చార్జి మంత్రి వద్ద నుంచి సిఫార్సు తీసుకురావాలని చెబుతున్నారని, మీరు కూడా ఇన్‌చార్జి మంత్రి నుంచి సిఫార్సు తెస్తున్నారా? అని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రశ్నించారు. ఈ అంశంపై ఎంపీ గోడం కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. అందరికీ సమానంగా పనులు ఇవ్వాలని సూచించారు. అధ్వానంగా మారిన రోడ్లకు ఎందుకు మరమ్మతులు చేపట్టడం లేదని ఆర్అండ్‌బీ, పంచాయరాజ్ శాఖల అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న తిర్యాణి రోడ్డు గురించి ఎమ్మెల్యే కోవ లక్ష్మి తెలుపగా.. ఆ రహదారి పనులు చేపట్టేందుకు అటవీశాఖ నుంచి అనుమతులు ఇవ్వడం లేదని ఆర్అండ్‌బీ ఎస్ఈ పేర్కొన్నారు. అక్కడే ఉన్న డీఎఫ్ఓ నీరజ్‌కుమార్ దానిని ఖండిస్తూ ఆ రహదారి విషయంపై నాకు ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదని సమాధానం ఇచ్చారు. వారిరువురి మధ్య సంభాషణ కొనసాగుతుండగా ఎంపీ కలుగజేసుకుని వెంటనే తిర్యాణి రహదారి పనులు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, డేవిడ్, ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: బూర్గుడ గాజులవాడలో రోడ్డుపైకి చేరిన వర్షపు నీరు



పెంచికల్‌పేట్: కొట్టుకుపోయిన కొండపల్లి-గొల్లవాగు తాత్కాలిక రోడ్డు



సిర్పూర్(టి): వెంకట్రావ్‌పేట్-పోడ్సా వంతెనను తాకేలా ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్‌గంగ నది



చింతలమానెపల్లి: రుద్రాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిలిచిన వరద నీరు



వాన జోరు.. వరద హోరు!

- జిల్లా అంతటా ఎడతెరిపిలేని వర్షం
- పొంగిపొర్లుతున్న వాగులు, ఒర్రెలు
- ఉప్పొంగిన ప్రాణహిత
- నీటమునిగిన పంటలు



కెరమెరి: సాంగ్వీ కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

ఆసిఫాబాద్/కెరమెరి/చింతలమానెపల్లి/దహెగాం/పెంచికల్‌పేట్/బెజ్జూర్/సిర్పూర్(టి)/కౌటాల: జిల్లా అంతటా రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. కుమురంభీం, వట్టివాగు ప్రాజెక్టుల్లో భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో అధికారులు కుమురంభీం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేశారు. జిల్లా కేంద్రంలోని పైకాజీనగర్‌లోని లోతట్టు ప్రాంతంలో వర్షపు నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆసిఫాబాద్ మండలంలోని అప్పపల్లి వాగు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయి ఆర్ఆర్‌కాలనీ వాసులు ఇబ్బందిపడ్డారు. కెరమెరి మండలంలోని లక్మాపూర్, అనార్‌పల్లి వాగులు నిండుకుండలా ప్రవహిస్తున్నాయి. సుమారు 15 గ్రామాలకు చెందిన ప్రజలు వాగు దాటి రాలేకపోతున్నారు. సాంగ్వి కల్వర్టుపై నుంచి నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. చింతలమానెపల్లి మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. గురువారం 51.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బాబాసాగర్ నాయకపుగూడ దారిలో వాగు ఉప్పొంగడంతో రవాణా నిలిచిపోయింది. పాల్వాయినగర్, చింతలపాటి వద్ద వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మార్గంలో రవాణా స్తంభించింది. గూడెం వద్ద అంతర్రాష్ట్ర వంతెన శ్లాబ్‌ను తాకేలా ప్రాణహిత నది ప్రవహిస్తోంది. పలు పాఠశాలల ఆవరణలోకి వరద నీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. దిందా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. శివపెల్లి, దిందా, నాయకపుగూడ, గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. బూరెపల్లి, రణవెల్లి గ్రామాలకు తాత్కాలికంగా రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాలు కొనసాగుతున్నందువల్ల వాగుల ఉధృతి కొనసాగనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. దహెగాం మండలంలోని ప్రాణహిత పరీవాహక ప్రాంతాల్లో మొట్లగూడ, రావులపల్లి, రాంపూర్ శివారులో 3 నుంచి 4వందల ఎకరాల్లో పత్తి పంటలు నీట మునిగాయి. పెంచికల్‌పేట్ మండలంలోని కొండపల్లి-గొల్లవాడ మధ్య ఒర్రె ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తాత్కాలిక రోడ్డు కొట్టుకు పోయింది. బొక్కివాగు, ప్రాణహిత ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అనిల్ కుమార్ సూచించారు. బెజ్జూర్ మండలంలో ప్రాణహిత నది ఉప్పొంగి సోమిని, తలాయి, తిక్కపల్లి, భీమారం, ఇప్పలగూడ, మొగవెల్లి, తదితర గ్రామాల్లో పంటపొలాలు నీటమునిగాయి. కృష్ణపల్లి, సుస్మీర్ సమీపంలోని రెండు ఒర్రెలు ఉప్పొంగడంతో 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సిర్పూర్(టి) మండలంలో వెంకట్రావ్‌పేట్-పోడ్సా అంతర్రాష్ట్ర హైలెవల్ వంతెనకు ఆనుకోని పెన్‌గంగ నది వరద నీరు ఉధృతంగ ప్రవహిస్తుండటంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరద ఉధృతి ఇలాగే కొనసాగితే తెలంగాణ-మహారాష్ట్రకు రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. వరద నీరు గంట గంటకూ పెరుగుతుండటంతో నదీ తీర ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు. కౌటాల మండలం తుమ్మిడిహెట్టి సమీపంలోని ప్రాణహితనది, తాటిపెల్లి వద్ద వార్ధానది, గుండాయిపేట సరిహద్దులోని పెనగంగ నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో మహారాష్ట్రకు రాకపోకలు నిలిచిపోయాయి.



చింతలమానెపల్లి: డబ్బా గ్రామ శివారులో నీట మునిగిన పంట భూములు



చింతలమానెపల్లి: గూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత నది



పెంచికల్‌పేట్: మురళీగూడలో ప్రాణహిత వరద నీటితో మునిగిన పత్తి పంట



ఆసిఫాబాద్: అప్పపల్లి గ్రామానికి వెళ్లే దారిలో పారుతున్న వరదనీరు

క్లుప్తంగా

బావిలో పడి యువకుడు మృతి


సునీల్(ఫైల్)

కడెం: వ్యవసాయ బావిలో పడి యువకుడు మృతి చెందినట్లు ఎస్సై పి.సాయికిరణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..మండలంలోని చొడు తండాకు చెందిన గుగ్లావత్ సునీల్(21) మతిస్థిమితం కోల్పోయాడు. బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతకగా గురువారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యమైంది. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందినట్లు భావిస్తున్నారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు ఢీకొని మహిళ..

రామకృష్ణాపూర్: పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ హట్స్ ఏరియా ప్రాంతానికి చెందిన మహరునిస్సా(43) బుధవారం రాత్రి రైలు ఢీకొని మృతిచెందింది. బంధువులతో కలిసి వరంగల్ వెళ్లిన మహరునిస్సా అక్కడి నుంచి భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చి రవీంద్రఖని రైల్వేస్టేషన్‌లో రైలు దిగారు. రైల్వేట్రాక్ దాటుతున్న క్రమంలో మరో ట్రాక్‌పై వేగంగా వచ్చిన ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడేమృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

దిందా వాగులో పడి యువకుడు గల్లంతు


సెడ్మెక సుమన్ (ఫైల్)

చింతలమానెపల్లి: దిందా వాగులో పడి యువకుడు గల్లంతయ్యాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. కేతిని గ్రామానికి చెందిన సెడ్మెక సుమన్(18) సుమన్ తన స్నేహితులతో కలిసి గురువారం దిందా వాగుకు అవతలి వైపు ఉన్న వ్యవసాయ భూముల వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో వారు వాగు దాటేందుకు ప్రయత్నించారు. సుమన్‌కు ఈతవచ్చినప్పటికీ అవతలివైపు చేరుకునే సమయంలో వాగు ఉధృతి పెరిగింది. సుమన్ గట్టుపై ఉన్న చెట్టును పట్టుకోగా చెట్టుకొమ్మ విరిగింది. దీంతో వాగు ఉధృతిలో కొట్టుకుపోయాడు. స్నేహితులు గ్రామస్తులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వాగు ఉధృతి ఎక్కువగా ఉండడం, చీకటి పడడంతో సహాయక చర్యలు చేపట్టలేకపోయారు. గల్లంతైన సుమన్ డిగ్రీలో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. డైట్ సెట్ పరీక్షకు హాజరయ్యాడు. తిరుపతి అమృత దంపతులకు సుమన్ పెద్దకుమారుడు. మరో అజయ్, కిషన్, కల్పన సంతానం ఉంది.

కలిసుంటే కలదు సుఖం..

• ఉమ్మడి కుటుంబాల్లో ఆత్మీయత, ప్రేమానురాగాలు • ఆత్మస్థైర్యంతోపాటు బలం • ఆదర్శంగా నిలుస్తున్న పలు ఫ్యామిలీలు

కాలం మారుతోంది.. జీవితం బిజీగా మారిపోయింది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. చిన్న కుటుంబాలే చింతలేని కుటుంబాలు అన్న భావన నెలకొంది. దీంతో పెద్ద కుటుంబాలు విడిపోయి, ఒక్కొక్కరూ ఒక్కో చోట జీవనం సాగిస్తున్న రోజులివి. చిన్నచిన్న మనస్పర్థలు, వ్యక్తిగత ఆలోచనలు వీరిని దూరం చేస్తున్నాయి. కానీ, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బంధాలను బలోపేతం చేస్తూ, ఆత్మస్థైర్యాన్ని పెంచుతుంది. ప్రేమ, అనురాగం, ఆత్మీయ ఆప్యాయతలకు ఇది ఒక గొప్ప వేదికగా నిలుస్తుంది. ఇప్పటికీ ఉమ్మడి కుటుంబాలు కష్టసుఖాలను పంచుకుంటూ, ఒకరికొకరు అండగా నిలుస్తున్నాయి. ఏళ్ల తరబడి ఒకే ఇంట్లో కలిసిమెలిసి జీవనం సాగిస్తూ, ఇవి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఒకరి ఆనందంలో అందరూ భాగస్వాములవుతూ, కష్టాల్లో ఒకరికొకరు తోడుగా ఉంటూ, ఈ కుటుంబాలు సామాజిక సమతుల్యతను కాపాడుతున్నాయి. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా, ఉమ్మడి కుటుంబాల విలువను గుర్తుచేసుకోవడం అవసరం. ఇవి కేవలం కుటుంబ సభ్యులను కలిపే సంస్థానం మాత్రమే కాదు..సమాజంలో ప్రేమ, సామరస్యం, సహకార భావనలను పెంపొందించే బలమైన ఆధారాలు. ఇటువంటి కుటుంబాలు మన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతూ, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.

నాలుగు దశాబ్దాలుగా..


నానక్‌సింగ్ కుటుంబం

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని ఆదిత్యనగర్ కాలనీకి చెందిన నానక్ సింగ్ పరివారం ఉమ్మడి కుటుంబం. గత నాలుగు దశాబ్దాలుగా కుటుంబమంతా ఒకేచోట కలిసి ఉంటుండడం విశేషం. నానక్ సింగ్-మంజీత్ కౌర్ దంపతులకు ఆరుగురు సంతానం. అందులో నలుగురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. చిన్నపాటి ఇనుప వస్తువులు, పనిముట్లు చేసుకుని జీవనం సాగిస్తున్నా, పరివారమంత ఒకే దగ్గర ఆత్మీయంగా కలిసి ఉంటున్నారు. కుటుంబంలో ఒక అబ్బాయికి తప్పా అందరికీ వివాహాలు జరిగాయి. తమ మధ్య ఉన్న అనుబంధమే మా అందరిని 40 ఏళ్లుగా కలిపి ఉంచిందని నానక్ సింగ్ చెబుతున్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా, తామందరం బాధ్యతలు పంచుకుని ఆ ఇబ్బంది నుంచి బయటపడేందుకు శ్రమిస్తామని పేర్కొంటున్నారు.

చిన్ననాటి నుంచి ప్రత్యేక శ్రద్ధ


కూతురు రుతికతో రాజశేఖర్, దీప దంపతులు

బోథ్: మండలకేంద్రానికి చెందిన రాజశేఖర్ దీప దంపతులు. వారికి పిల్లల సంఖ్య కన్నా, వారిపై పెట్టే శ్రద్ధ ముఖ్యమని నమ్మారు. మేము ఒక్కరే కావాలనుకున్నారు. ఆ ఒకరిలో అన్ని విలువలు, విజ్ఞానం, మంచి భవిష్యత్తును ఇవ్వాలని అనుకురు. సంతానంగా కూతురు రుతిక పుట్టింది. ఆమె అభ్యున్నతికి పూర్తి సమయాన్ని కేటాయిస్తున్నారు. చిన్ననాటి నుంచి ప్రత్యేక శ్రద్ధ కనబర్చారు. ఇటీవల విడుదలైన లాసెట్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు వచ్చింది. చిన్న కుటుంబం వల్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చామని అనుకుంటున్నాం.

ఉమ్మడి కుటుంబం..ఆత్మీయం


జానకొండ శ్రీకాంత్ కుటుంబ సభ్యులు

తాంసి: మండల కేంద్రానికి చెందిన జానకొండ శ్రీకాంత్ ఉమ్మడి కుటుంబంగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నర్సయ్య-లక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. కుమార్తె వివాహం అనంతరం కొన్నేళ్లకు తండ్రి నర్సయ్య మృతిచెందాడు. పెద్ద కుమారుడు శ్రీకాంత్ అన్నీతానై కుటుంబ బాధ్యతలను తనపై వేసుకుని ముందుకు నడిపించాడు. కుటుంబం కోసం వ్యాపారం ప్రారంభించి, తమ్ముడు అశోక్‌ను ఉన్నతంగా చదివించాడు. అన్న కష్టానికి తగ్గట్టుగా పట్టుదలతో చదివి పంచాయతీ కార్యదర్శి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ప్రస్తుతం సాత్నాల మండలంలో విధులు నిర్వహిస్తున్నాడు. సివిల్స్‌కు సన్నద్ధమై ఇంటర్వ్యూ వరకు వెళ్లాడు. ఇటీవల గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్రస్థాయి 250వ ర్యాంక్, గ్రూప్-3లో 417 ర్యాంక్ సాధించాడు. ప్రస్తుతం తల్లితోపాటు వివాహమైనప్పటికీ సోదరులు ఇద్దరు ఉమ్మడిగా ఉంటున్నారు. నలుగురు పిల్లలు, ఇద్దరు భార్యాభర్తలు, తల్లి మొత్తం తొమ్మిది మంది ఒకే చోట ఉంటున్నారు.

పిల్లలను ఉన్నతంగా చదివిస్తా


కుటుంబంతో సంతోష్

భీంపూర్: మండలంలోని గుంజాల గ్రామానికి చెందిన మడావి సంతోష్- విమలబాయి దంపతులు. వీరికి సుదర్శన్, మంజుష సంతానం. దంపతులు వృత్తిరీత్యా వ్యవసాయ కూలీలు. కుమారుడు ఉట్నూర్ లాల్‌టెక్డిలోని కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. కూతురు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. పిల్లల జీవితం తనలాగా కాకుండా వారి ఆశయాలకు అనుగుణంగా చదివిస్తున్నాడు.

25 ఏళ్లుగా ఉంటున్నాం


మహేశ్‌శాస్త్రి,కాగజ్‌నగర్

ఆసిఫాబాద్‌అర్బన్: కలిసి ఉంటే కలదు సుఖం అని మన పూర్వీకులు చెబుతుంటారు. కాగజ్‌నగర్‌కు చెందిన పూసాల మహేశ్ శాస్త్రి తన తల్లిదండ్రులతో పాటు, అన్నదమ్ములు వారి పిల్లలు మొత్తం 14 మంది ఒకే ఇంట్లో గత 25 ఏళ్లుగా కలిసి ఉంటున్నాం. ఉమ్మడి కుటుంబాల్లో ఉండడం వల్ల ఒకరికొకరికి ప్రేమలు పెరుగుతాయి. ప్రస్తుతం చిన్నచిన్న కుటుంబాలు ఉండడంతో వారికి అనుభవం లేక మనస్పర్థలు మొదలై కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. పెద్దల సలహాలు, సూచనలు ఉమ్మడి కుటుంబంలో ఎల్లవేళలా అందుతాయి.

నీట్‌లో విద్యార్థి ప్రతిభ


కుషేంద్రవర్మ

లక్సెట్టిపేట: నీట్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని బలరావుపేట గ్రామానికి చెందిన కందుల కుషేంద్ర వర్మ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి 59 ర్యాంకు సాధించాడు. పదో తరగతి వరకు పట్టణంలోని గుడ్ షెప్పర్డ్ పాఠశాల, చైతన్య కళాశాలలో ఇంటర్ చదివి మంచి మార్కులు సాధించాడు. ఈయన తండ్రి ప్రవీణ్‌కుమార్ ప్రైవేటు టీచర్, తల్లి సుమలత గృహిణి. కుమారుడు నీట్‌లో ర్యాంక్ సాధించడంపై పలువురు అభినందించారు.

గుడుంబా పట్టివేత

జైపూర్: బైక్‌పై గుడుంబా తరలిస్తుండగా ఒకరు పోలీసులకు పట్టుబడ్డాడు. భీమారం మండల కేంద్రంలో ఆరెపల్లి క్రాస్ రోడ్డు వద్ద గురువారం ఉదయం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కొత్తూర్ మండలం లంబాడి తండాకు చెందిన ధరావత్ శంకర్ బైక్‌పై 30లీటర్ల గుడుంబా తరలిస్తుండగా పట్టుబడ్డాడు. పోలీసులకు చిక్కకుండా ప్రయత్నించగా జోడువాగు వద్ద శంకర్‌ను అదుపులో తీసుకుని బైక్, గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు. ఆయనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బాసరలో ముగిసిన గురుపౌర్ణమి వేడుకలు


పూజలో ఎమ్మెల్యే రామారావు పటేల్

బాసర: బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో గురుపౌర్ణమి వేడుకలు గురువారంతో ముగిశాయి. వ్యాసమహర్షి, సరస్వతి, వహాంకాళి, మహాలక్ష్మి అమ్మవార్లకు అర్చకులు పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్ ఉన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య


శుభం (ఫైల్)

ఇంద్రవెల్లి: మద్యం మత్తులో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఇ.సాయన్న తెలిపారు. ఎస్సై ఇ.సాయన్న, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలో దనోరా(బి) పంచాయతీ పరిధి ఇన్కార్‌గూడకు చెందిన ఎల్నారే అనిల్, ఉమ దంపతులకు ఏకైక కుమారుడు శుభం(23). డిగ్రీ పూర్తి చేసి ఇంట్లో ఉంటున్నాడు. గత కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 7న మద్యం తాగి ఇంటికొచ్చిన కుమారుడిని రోజు మద్యం ఎందుకు తాగుతున్నావని తల్లి ఉమ మందలించింది. క్షణికావేశంతో వ్యవసాయ చేనుకు వెళ్లి గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి చెప్పాడు. గ్రామస్తుల సహాయంతో ఓ ప్రైవేట్ వాహనంలో ఆదిలాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరు..



పోశెట్టి (ఫైల్)

సోన్: అప్పుల బాధ, భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపం చెందిన ఒకరు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని న్యూవెల్మల్ గ్రామానికి చెందిన పట్టం పోశెట్టి(34) గతంలో దుబాయ్ వెళ్లి అప్పుల పాలయ్యాడు. భార్య పోసవ్వ అలియాస్ అరుణకు కుమారుడు ఉన్నాడు. ఆమె ఇటీవల భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లింది. అటు అప్పుల బాధ, ఇటు భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెందిన పోశెట్టి గురువారం ఇంట్లో చీరతో ఉరేసుకున్నాడు. మృతుడి అక్క ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.గోపి తెలిపారు.

ఎలక్ట్రానిక్స్ గోదాంలో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని మోహన్ ఎలక్ట్రానిక్స్ గోదాంలో జరిగిన దొంగతనాన్ని నిర్మల్ పోలీసులు ఛేదించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం రూరల్ సీఐ కృష్ణ వివరాలు వెల్లడించారు. గత కొన్ని రోజులుగా గోదాంలోని ఎలక్ట్రానిక్ వస్తువులు కనిపించకుండా పోవడాన్ని యజమాని వెంకటరమణ గుర్తించారు. దీంతో ఆడిట్ నిర్వహించారు. అనుమానాస్పదంగా పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నవత్ శ్రీకాంత్, జిందాడే సచిన్, సాబ్లే జగదీశ్వర్, కూసులే నవీన్‌ను విచారించగా వారు దొంగతనానికి పాల్పడ్డట్లు ఒప్పుకున్నారు. దొంగతనం చేసిన వస్తువులను తరలించేందుకు ఆటో డ్రైవర్ సయ్యద్ ఇమ్రాన్ సహాయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి ఒక ఫ్రిడ్జ్, గీజర్, సామ్‌సంగ్ టీవీ, ఆరు కూలర్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఇందులో ఎస్సై సంజీవ్ ఉన్నారు.

కరీంనగర్ కోర్టుకు హాజరైన అఘోరి శ్రీనివాస్


శ్రీనివాస్‌ను జైలుకు తరలిస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: ఉమ్మడి రాష్ట్రంలో హల్‌చల్ చేసిన అఘోరి శ్రీనివాస్ గురువారం కరీంనగర్ కోర్టుకు హాజరయ్యాడు. కొత్తపల్లి పోలీసులు పీటీ వారెంటుపై చర్లపల్లి జైలు నుంచి తీసుకొచ్చి కరీంనగర్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుషాన్‌పల్లికు చెందిన శ్రీనివాస్‌తో జిల్లాకు చెందిన ఓ మహిళకు నవంబర్ 2024లో పరిచయం ఏర్పడింది. శ్రీనివాస్ తనపై లైంగిక దాడి జరిపాడని, జనవరి 2025లో కొండగట్టు తీసుకెళ్లి తాళికట్టాడని, రూ.3 లక్షలు తీసుకున్నాడని సదరు మహిళ కొత్తపల్లి పోలీసులకు 2025 ఏప్రిల్ 28న ఫిర్యాదు చేసింది. పోలీసులు శ్రీనివాస్‌పై పలుసెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. చర్లపల్లి జైల్లో ఉన్న శ్రీనివాస్‌ను పీటీ వారెంట్ ద్వారా కరీంనగర్ కోర్టులో హాజరు పర్చారు. శ్రీనివాస్‌కు కోర్టు ఈ నెల 23వరకు రిమాండ్ విధించింది. అనంతరం శ్రీనివాస్‌ను పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు.

గుడ్లబోరిలో మద్యనిషేధం

కౌటాల: మండలంలోని గుడ్లబోరి గ్రామంలో గురువారం మద్య నిషేధం విధిస్తున్నట్లు మహిళలు తీర్మానించారు. గుడ్లబోరి పంచాయతీ పరిధిలోని విజయనగరం, వైగాం, సైదాపూర్, మరియపూరం గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారని వారు తెలిపారు. యువత మద్యానికి బానిసై ఆత్మహత్యలు చేసుకుని కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో మద్యం, గంజాయి విక్రయిస్తే పోలీసులు చర్యలు తీసుకోవాలని మహిళలు తీర్మానం చేశారు. శ్రావంతి, విఠబాయి, సవిత, తారబాయి, మమత, పోచుబాయి, విమలబాయి పాల్గొన్నారు.

నకిలీపత్రాలు సృష్టించి మోసగించిన ఆరుగురిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వ టీచర్, ఆయన భార్య ముఠాతో కలిసి నకిలీ పత్రాలు సృష్టించి మోసగించిన ఆరుగురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని పీహెచ్‌సీ కాలనీకి చెందిన అరేవార్ రాజన్నకు దాసరి జ్యోతి, గుగులోత్ బాపురావ్‌లు సుపరిచితులు. వీరు తక్కువ ధరకు ప్లాట్‌లు లభిస్తాయని రాజన్నతో చెప్పారు. దీంతో ఆయనకు సర్వే నంబర్ 68/54/4లోని ప్లాట్ నంబర్లు 28, 29, 30, 65లు చూపించారు. ఆయన కొనుగోలు చేయడానికి నిర్ణయించుకున్నారు. దాసరి జ్యోతి, గుగులోత్ బాపురావ్ కలిసి కాండవేని సత్యమ్మ, కాండవేని కల్యాణిలు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ద్వారా గోడ్డెంల శ్రీనివాస్, గుగులోత్ అంబికా, పాలేపు శ్రీనివాస్, భూమన్నల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించారని బాధితుడిని నమ్మబలికారు. 2023 మే 25న ప్లాట్‌నంబర్ 65 రాజన్న కుమార్తె అరేవార్ రోజా, ప్లాట్ నంబర్ 28 రాజన్న అల్లుడు గడ్డేవార్ మహేశ్ పేర్లపై, మిగతా రెండు ప్లాట్‌లు 29, 30 రాజన్న పేరుపై రిజిస్ట్రేషన్ జరిగింది. వీటికి గాను వారు రూ.23 లక్షలు చెల్లించారు. గతేడాది నవంబర్‌లో ప్లాట్ చుట్టూ ఫెన్సింగ్ వేయడానికి వెళ్లిన సమయంలో అప్పటికే ఆ ప్లాట్‌లకు ఎవరో ఫెన్సింగ్ వేసి ఉన్నట్లు గుర్తించారు. బాధితులు నిందితులైన దాసరి జ్యోతి, బాపురావ్‌లను అడిగినప్పుడు వారు సరైన సమాధానం ఇవ్వలేదు. ఆ ప్లాట్‌లు అప్పటికే మరొకరికి విక్రయించినట్లు తెలిసింది. రాజన్న ఈనెల 8న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే దాసరి జ్యోతి ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. గుగులోత్ బాపురావ్ (ప్రభుత్వ టీచర్), గుగులోత్ అంబికా (ఉపాధ్యాయుడి భార్య), గోడ్డెంల శ్రీనివాస్, పాలేపు శ్రీనివాస్, భూమన్నలపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్, ఎస్సై విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

మంచిర్యాలటౌన్: హెచ్‌సీఏ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జీఎస్సార్ క్రికెట్ గ్రౌండ్‌లో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమైంది. రెండు రోజుల లీగ్ చాంపియన్‌షిప్‌లో గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు హైదరాబా ద్‌కు చెందిన ఇంపీరియల్ టీంతో తలపడింది. మొదట బ్యాటింగ్ చేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు 74.2 ఓవర్లలో 328 పరుగులకుఆలౌటైంది. ఇంపీరియల్ టీం 9 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా నష్టపోకుండా 62 పరుగులు చేసింది. ఆదిలాబాద్ జట్టు నుంచి సింహాద్రి 151, ఆడె సంతోష్ 129 పరుగులు చేశాడు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

కుభీర్: స్థానిక బస్టాండ్‌లో కుప్టి గ్రామానికి చెందిన బొయిడి తిరుమల రూ.24,416 నగదు, రెండు వెండి కాళ్లగజ్జలు ఉన్న పర్సు పోగొట్టుకుంది. ఆ పర్సు కుభీర్‌కు చెందిన దొంతుల పుష్పకు దొరకగా గురువారం భర్త దత్తాత్రికి ఇచ్చి పోలీసుస్టేషన్‌లో అప్పగించాలని చెప్పింది. భర్త.. స్టేషన్‌కు వెళ్లి ఎస్సై క్రిష్ణరెడ్డికి పర్సు అప్పగించాడు. అడిషనల్ ఎస్పీ ఉపేందర్‌రెడ్డి ఆ బాధితురాలు తిరుమలకు పర్సు అప్పగించాడు. నిజాయతీగా పర్సు ఇచ్చిన దత్తాత్రిని సన్మానించారు. ఏఎస్సై లక్ష్మణ్, పోలీసులు ఉన్నారు.

హోరాహోరీగా బాలికల ఫుట్‌బాల్ పోటీలు

• సెమీస్‌కు నల్గొండ, నిజామాబాద్, ఖమ్మం, రంగారెడ్డి జట్లు


ఆదిలాబాద్-రంగారెడ్డి మధ్య మ్యాచ్

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్రస్థాయి బాలికల జూనియర్స్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. వర్షం కారణంగా కొంత ఆటంకం ఏర్పడినప్పటికీ ఉదయం లీగ్ కమ్ నాకౌట్ పోటీలు నిర్వహించారు. మధ్యాహ సమయంలో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు ఉత్సాహంగా సాగాయి. మహబూబ్‌నగర్-నల్గొండ జట్ల మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో రెండు జట్లు దీటుగా తలపడ్డాయి. నిర్ణీత సమయం ముగిసేసరికి ఏ ఒక్క జట్టు కూడా గోల్ సాధించకపోవడంతో మ్యాచ్ టై గా ముగిసింది. దీంతో పెనాల్టీ షూటౌట్‌లు నిర్వహించారు. ఇందులో నల్గొండ జట్టు 2-1 తేడాతో మహబూబ్‌నగర్‌పై గెలిచి సెమీస్‌కు చేరింది. మరో క్వార్టర్ ఫైనల్లో వనపర్తి-ఖమ్మం జట్లు తలపడగా 0-1 తేడాతో ఖమ్మం గెలుపొందింది. అంతకుముందు జరిగిన క్వార్టర్స్‌లో నిజామాబాద్-గద్వాల్ జట్లు తలపడగా 7-1 గోల్స్‌తో నిజామాబాద్ గెలుపొందింది. ఇక ఆతిథ్య ఆదిలాబాద్ జట్టుకు క్వార్టర్ ఫైనల్స్‌లో నిరాశే ఎదురైంది. రంగారెడ్డి-ఆదిలాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 4-0 గోల్స్‌తో రంగారెడ్డి గెలిచి సెమీస్‌కు చేరింది. శుక్రవారం ఉదయం మొదటి సెమీఫైనల్ మ్యాచ్ నల్గొండ-నిజామాబాద్‌ల మధ్య, రెండో సెమీఫైనల్ మ్యాచ్ ఖమ్మం-రంగారెడ్డి జట్ల మధ్య జరుగనుంది.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

• డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్

సాక్షి ఎఫెక్ట్..


పీహెచ్‌సీని పరిశీలిస్తున్న సుధాకర్‌నాయక్

వేమనపల్లి: విధుల్లో నిర్లక్ష్యం చేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ అన్నారు. పీహెచ్‌సీలో ప్రసవ వేదన శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి కృపబాయితో కలిసి పీహెచ్‌సీలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ప్రసూతి కోసం కొండగొర్ల సోనియా పీహెచ్‌సీకి వచ్చినప్పుడు ఎవరు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఇలాంటివి పునరావృతమైతే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. లోతట్టు గ్రామాల్లోని గర్భిణులను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అత్యవసర వేళ 108 సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు పెరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట జిల్లా కమ్యూనిటీ అధికారి వెంకటేశ్వర్, బీపీహెచ్‌ఎన్ ఆర్ఎస్ పద్మ, ఎస్‌యూటీలు జగదీశ్, వసంత, సూపర్‌వైజర్ అపరంజి, రాంశెట్టి బాపు ఉన్నారు.

నకిలీ పోలీసుల ముఠా అరెస్ట్

• అదుపులో నలుగురు, పరారీలో ఒకరు
• కారు, బైక్, ఆటో బంగారు, వెండి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఇచ్చోడ: నకిలీ పోలీసుల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఇచ్చోడ సీఐ కార్యాలయంలో గురువారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. నల్గొండ జిల్లా నిడమనూర్ గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్ (పశువుల వ్యాపారి), చింతల చెరువు ప్రశాంత్(లారీ క్లీనర్), బదనపూరి అజయ్(మోటార్ మెకానిక్) బొప్పరం సుధాకర్ (సెల్ పాయింట్), ఒట్కూరి నరేష్ (పెట్రోల్ బంక్ ఉద్యోగి) ఐదుగురు ముఠాగా ఏర్పడ్డారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ ఎస్సై పేరు చెప్పి వివిధ ప్రాంతాల్లో బంగారు వ్యాపారులను బెదిరించి డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారు. గతనెల 27న రంగారెడ్డి జిల్లాకు చెందిన కొండోజు నరసింహచారికి ఫోన్ చేసి ఇచ్చోడ ఎస్సై నర్సిరెడ్డి అని పరిచయం చేసుకున్నాడు. నాలుగేళ్ల క్రితం 11 గ్రాముల బంగారం కొన్నారని కేసు కాకుండా ఉండాలంటే గూగుల్ పే ద్వారా డబ్బులు పంపాలని డిమాండ్ చేశారు. అనుమానం వచ్చిన నరసింహచారి తనకు ఫోన్ చేసిన వ్యక్తి నకిలీ ఎస్సైగా గుర్తించి ఇచ్చోడ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈనెల 4న హైదరాబాద్‌కు చెందిన రుద్రంగి కిరణ్ కుమార్‌కు ఫోన్ చేసి ఇచ్చోడ ఎస్సై నర్సిరెడ్డి మాట్లాడుతున్నట్లు చెప్పి, దొంగ బంగారం కొన్నారని బెదిరించి సదరు వ్యక్తి నుంచి రూ1.50 లక్షలు వసూళ్లు చేశారు. అనుమానం వచ్చిన కిరణ్‌కుమార్ సైతం ఇచ్చోడలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నకిలీ ఎస్సై అంటూ మోసాలకు పాల్పడుతున్న ముఠా సభ్యుల్లో నలుగురిని మండల కేంద్రంలో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. ఒట్కూరి నరేశ్ పరారీలో ఉన్నారు. వీరిపై గతంలో నల్గొండ, హుజుర్‌నగర్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నవి. హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, బెంగళూరు, చెన్నై నగరాల్లోని ఆభరణాల షాపుల యజమానులకు ఫోన్ చేసి బెదిరించి దాదాపు రూ.18 లక్షలు వసూలు చేసి జల్సాలకు వాడుకున్నట్లు తేలింది. నిందితుల నుంచి కారు, ఆటో, బంగారు, వెండిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, ఇచ్చోడ సీఐ బండారి రాజు, ఎస్సై పురుషోత్తం పాల్గొన్నారు.